సాక్షి
మెదక్

గురువారం । 18 । జూలై । 2024



దర్పం వెనుక కన్నీటి ధార

తాము నమ్మిన పార్టీ కోసం పునాది రాళ్లలా నిలిచారు. నాయకుల గెలుపు కోసం జెండా మోసి నష్టపోయారు. వివరాలు 8లో ▸



పంచాక్షరీ మంత్రం..

ఓం నమ శివాయ అనే పంచాక్షరీ మంత్రం సర్వ శ్రేయస్కరమని మహా సహస్ర అవధాని గరికపాటి అన్నారు. వివరాలు 8లో ▸



అస్తవ్యస్తంగా ప్రాథమిక విద్య

జిల్లాలో కొన్ని చోట్ల పాఠశాలలు మూతపడినా కొనసాగుతున్నట్టు రికార్డులలో చూపుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

తొలి విడతలో 47,978 మంది రైతులు

- నేడు ఖాతాల్లో మాఫీ డబ్బుల జమ



మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా రూ.లక్ష లోపు రుణాలు ఉన్న 47,970 మంది రైతుల ఖాతాల్లో గురువారం రుణమాఫీ సొమ్ము జమ కానుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఆగస్టు 15వ తేదీ లోపు రూ.2 లక్షల వరకు రుణమాఫీ పక్రియ పూర్తి చేస్తామన్నారు. కాగా కుటుంబంలో రూ. 2 లక్షలకు పైగా రుణం ఉంటే రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కాగా మొదటి విడతలో అత్యధికంగా పాపన్నపేట మండలంలో 4,209 మంది రైతులకు రూ. లక్ష లోపు రుణాలు మాఫీ అవుతుండగా.. అతితక్కువగా మనోహరాబాద్ మండలంలో 1,027 మంది రైతులకు మాఫీ జరుగనుంది. అల్లాదుర్గం మండలంలో 1,574, చేగుంట 2,801, చిలప్‌చెడ్ 1,871, హవేళిఘనాపూర్ 3,044, కౌడిపల్లి 2,429, కొల్చారం 2,496, మెదక్ 2,205, నర్సాపూర్ 2,690, నార్సింగి 1,183, నిజాంపేట 1,789, రామాయంపేట 2,613 రేగోడు 1,531, పెద్దశంకరంపేట 2,532, చిన్నశంకరంపేట 3,546, శివ్వంపేట 2,526, టేక్మాల్ 2,849, తూప్రాన్ 1,419, వెల్దుర్తి 3,644 రైతులకు తొలి విడత మాఫీ వర్తించనుంది. నేడు కౌడిపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో మాట్లాడనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రుణమాఫీ రైతులకు వరం

నర్సాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న రైతు రుణమాఫీ నిర్ణయం రైతులకు వరమని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో రైతులకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. తమ పార్టీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలుకు రంగం చేసిందన్నారు. గురువారం సాయంత్రం రైతు వేదికల వద్ద చేపట్టే కార్యక్రమాల్లో ముఖ్యనాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్‌లో నేడు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, పార్టీ నాయకులు ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

మహాసభకు తరలిరండి

కొల్చారం(నర్సాపూర్): ఈనెల 19వ తేదీన యాదగిరిగుట్టలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో వర్గీకరణ చేపడుతామని మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకే మహాసభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధులను విస్మరించొద్దు



వీరయ్యకు వైద్యం అందిస్తున్న వైద్యులు

నర్సాపూర్: వృద్ధుల ఆలన.. పాలనపై కుటుంబ సభ్యులు అలసత్వం వహిస్తే చట్టప్రకారం శిక్షకు గురవుతారని జూనియర్ సివిల్ జడ్జి అనిత హెచ్చరించారు. మండలంలోని రుస్తుంపేటకు చెందిన వీరయ్య కొంతకాలంగా నర్సాపూర్‌లోని పోచమ్మ ఆలయం సమీపంలో ఒంటరిగా ఉంటున్నాడు. కాగా బుధవారం ఆయన అనారోగ్యంతో సొమ్మసిల్లి పడిపోయిన విషయాన్ని పట్టణానికి చెందిన పలువురు గుర్తించి జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జడ్జి వీరయ్యకు వైద్యం అందించాలని ఎస్‌ఐ పుష్పరాజ్‌కు సూచించారు. దీంతో ఎస్‌ఐ వీరయ్యను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా వీరయ్య స్వగ్రామంలో అతడి పేరిట స్థిరాస్తులు ఉన్నాయని, వాటిని కొందరు స్వాధీనం చేసుకున్నారని గ్రామస్తులు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. విచారణ చేసి పూర్తి నివేదిక అందజేయాలని ఎస్‌ఐని ఆదేశించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్: ఈనెల 21న గురు పౌర్ణమిను పురస్కరించుకుని ఖేడ్ నుంచి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నందున.. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య కోరారు. బుధవారం అరుణాచలానికి టికెట్ బుక్ చేసుకున్న వారికి బస్టాండ్‌లో మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండుతో కలిసి రశీదులను అందజేశారు. ఈనెల 19 సాయంత్రం 4 గంటలకు ఖేడ్ నుంచి బస్సులు బయలు దేరుతాయని ఆయన తెలిపారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం


త్యాగానికి ప్రతీక అయిన మొహర్రంను బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. భక్తులు చావిడిలలోని పీర్లను దర్శించుకొని బెల్లం ,కొబ్బరితో పాటు దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దశంకరంపేటలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– పెద్దశంకరంపేట (మెదక్)



పెద్దశంకరంపేటలో పీర్ల సందడి

బోనస్ సరే.. సన్నాలు మరి!



చందాపూర్ శివారులో సన్నరకం సాగు

33 రకాల ప్రస్తావన

- జిల్లాలో ఐదు వెరైటీలే అధికం
- జాబితాలో ఉన్నవి రెండు మాత్రమే..
- అయోమయంలో అన్నదాత

మెదక్‌జోన్: చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఉంది వ్యవసాయశాఖ పనితీరు. వానాకాలం ప్రారంభమై రెండు నెలలు కావొస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో వరి సాగు చేసే రైతుల్లో సగం మంది అందుబాటులో దొరికే సన్న రకాలను సాగు చేశారు. కాగా ఇప్పుడు 33 రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు. తాము సాగు చేసిన సన్నరకానికి బోనస్ వస్తుందా..? లేదా అంటూ అయోమయానికి గురవుతున్నారు.

జిల్లాలో ఏటా వానాకాలంలో 3 లక్షల ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేస్తారు. ఇందులో 80 శాతం దొడ్డు రకం కాగా 20 శాతం మాత్రమే సన్నాలు సాగు చేసేవారు. కాగా ఈ ఏడాది సన్నలు సాగు చేస్తే క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సగం మంది రైతులు అందుబాటులో దొరికిన సన్న రకాలను సాగు చేశారు. ఈ ఏడాది 3.27 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో రైతులు సన్నాలకు సంబంధించిన నారుమళ్లు పోసి నాట్లు కూడా వేస్తున్నారు. తీరా వ్యవసాయశాఖ తాము చూపించిన 33 రకాలు సాగు చేసిన వారికే బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు.

అత్యధికంగా ఐదు రకాలే..

జిల్లాలో అత్యధికంగా సాగు చేసిన సన్న వెరైటీల్లో ఆర్ఎన్ఆర్ (15048), బీపీటీ (5204), జేజీఎల్ (27356) హెచ్ఎంటీ సోన (1224), ఎంటీయూ (1271) ఐదు సన్న రకాలను మాత్రమే రైతులు అత్యధికంగా సాగు చేశారు. కాగా వ్యవసాయశాఖ చూపిన 33 రకాలలో జిల్లా రైతాంగం సాగు చేసిన ఐదు వెరైటీల్లో కేవలం ఆర్ఎస్ఆర్ (15048), ఎంటీయూ (1271) మాత్రమే ఉన్నాయి. మిగితా మూడు రకాలు ప్రభుత్వం చూపిన జాబితాలో లేవు. దీంతో సన్నాలకు బోనస్ వస్తుందనే ఆశతో సాగు చేస్తే తీరా నాట్లు వేశాక ఫలానా రకాలకే ఇస్తామని ప్రకటించడం సరికాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం వానాకాలం ప్రారంభంలోనే చెప్పాల్సిందని వాపోతున్నారు.


అన్నిరకాలకు ఇవ్వాలి



నాకున్న నాలుగు ఎకరాల్లో అన్నం అనే కొత్త రకం సన్నాలు సాగు చేశాను. నాటు వేసి 15 రోజులు అవుతోంది. తీరా ప్రభుత్వం ఫలనా రకాలకే బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఇదే విషయం వానాకాలం సాగు ప్రారంభంలోనే చెప్పాల్సింది. తీరా నాట్లు వేశాక ప్రకటించడం సరికాదు.

– సంజీవరెడ్డి, రైతు జంగరాయి

మిషన్ ద్వారా నిర్ధారణ



ప్రభుత్వం ప్రస్తావించిన 33 రకాలతో పాటు రైతులు సాగు చేసిన సన్నరకం ధాన్యం చేతికందాక మిషన్‌పై టెస్టు చేస్తారు. ఒక్కో వరి గింజ 2.5 ఎంఎం పొడవు ఉంటే దాన్ని సన్నరకం ధాన్యంగా పరిగణిస్తారు. ఇందుకు సంబంధించిన మిషన్లు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి.

– గోవింద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పట్టుసడలకుండా..

కేడర్‌ను కాపాడుకునే ప్రయత్నాలు

- పటాన్‌చెరులో కార్యకర్తలతో హరీశ్‌రావు సమావేశం
- భవిష్యత్ తమదేనంటూ గులాబీ శ్రేణులకు భరోసా



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్ఎస్ పార్టీకి ఉమ్మడి మెదక్ జిల్లాలో గట్టి షాక్ తగలడంతో ఆపార్టీ అధినాయకత్వం అప్రమత్తమైంది. గులాబీకి కంచుకోటగా పేరున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కారు దిగడంతో నష్ట నివారణ చర్యలు చేపట్టింది. ఆయన వెంట నియోజకవర్గంలోని పార్టీ కేడర్ వెళ్లకుండా కాపాడుకునే ప్రయత్నాలు చేస్తోంది. మాజీ మంత్రి హరీశ్‌రావు బుధవారం పటాన్‌చెరుకు వెళ్లి పార్టీ శ్రేణులతో భేటీ అయ్యారు. జీహెచ్ఎంసీ భారతీనగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి, తెల్లాపూర్ చైర్‌పర్సన్ లలితా సోమిరెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఆయన చర్చించారు.

భరోసా..

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని హరీశ్‌రావు కార్యకర్తలకు భరోసా నింపే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా రెండోసారి అధికారంలోకి వచ్చిన దాఖలాల్లేవని, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తామని ధైర్యం నింపారు. కష్టకాలంలో పార్టీకి వెన్నంటి ఉన్న కార్యకర్తలను కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. కార్యకర్తల సంక్షేమంపై కూడా కొంత ఆలోచన చేయాల్సిందని గుర్తుచేసుకున్నారు. కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లకుండా ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇటు ద్వితీయ శ్రేణి నాయకులను కూడా ఎన్నికలకు సమాయత్తం చేసే ప్రయత్నం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, సర్పంచ్ ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వం కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొవాలని సంకేతాలు పంపారు.

ఎమ్మెల్యేలతో స్పీకర్‌కు ఫిర్యాదులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్నికల్లో ఏడు స్థానాలను బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుంది. అయితే గూడెం మహిపాల్‌రెడ్డి బాటలోనే మరికొందరు ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని మిగతా ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్‌లోనే ఉంటారనే సంకేతాలు ఆ పార్టీ అధినాయకత్వం పంపుతోంది. ఇందులో భాగంగానే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఎమ్మెల్యేలతోనే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిప్రతాలు ఇప్పించారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు అయోమయానికి గురికాకుండా ముందుజాగ్రత్తలు తీసుకుంటోంది. కాంగ్రెస్ సర్కార్‌పై గులాబీ పార్టీ ఎమ్మెల్యేలంతా పోరాటానికి సిద్ధగా ఉన్నారనే సంకేతాలను పంపారు. మొత్తంగా పార్టీ శ్రేణులకు పూర్తి స్థాయిలో భరోసా కల్పించి, ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టు జారకుండా అన్ని జాగ్రత్తలు ఆ పార్టీ అధినాయకత్వం తీసుకుంటోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



చిన్నకోడూరులో నాయకుల సంబరాలు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసినందుకు బుధవారం చిన్నకోడూరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రైతు రుణమాఫీపై ప్రతి పక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ఏక కాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రతి పక్షాలు ఓర్వడం లేదన్నారు. నాయకులు మహేందర్, పరశురాములు, జయంత్, గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మాఫీ చేశాం.. రాజీనామా చెయ్

హరీశ్‌రావుకు ఎమ్మెల్యే రోహిత్ సవాల్

పాపన్నపేట(మెదక్): ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయ రుణాలు మాఫీ చేశారు. హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేసి మాట నిలుపుకోవాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సవాల్ విసిరారు. బుధవారం మండల పరిధిలోని బాచారంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలను కలిసి రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం పాపన్నపేట ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ చేశారని కొనియాడారు. గురువారం ఏకకాలంలో రూ. లక్ష రుణాలను మాఫీ చేయనున్నారని తెలిపారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నా, కొంత మంది అధికారులు బీఆర్ఎస్ నాయకులు చూపే ప్రలోభాలకు అమ్ముడు పోయి కరెంట్ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన రుణ మాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ఆది నుంచి కాంగ్రెస్‌కు వచ్చిందని కొనియాడారు. బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మాజీ కోఆప్షన్ సభ్యుడు గౌస్, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయ కులు నర్సింలు, శ్రీనివాస్ చౌదరి, బొజ్జ పవన్, నరేందర్‌గౌడ్, అమర్‌సేనారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు తీపి కబురు



రామాయంపేట(మెదక్): పదవీ విరమణ పొందనున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 65 ఏళ్లు నిండిన టీచర్లకు రూ. రెండు లక్షలు, ఆయాలకు రూ. లక్ష ఇస్తామని మంత్రి సీతక్క మంగళవారం ప్రకటించారు. గత ప్రభుత్వం 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లకు రూ. లక్ష, ఆయాలకు రూ. 50 వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతం జిల్లాలో 65 ఏళ్లు నిండి పదవీ విరమణ కోసం ఎదురుచూస్తున్న వారిలో 72 మంది ఆయాలు, ముగ్గురు టీచర్లు ఉన్నారు. పదవీ విరమణ అనంతరం తమకు ఇచ్చే ప్రోత్సాహకం పెంచాలని కొంతకాలంగా వారు ఆందోళన చేస్తున్నారు. ఈమేరకు ఇటీవల కలెక్టర్ ఎదుట పలు దఫాలుగా దీక్షలు సైతం కొనసాగించారు. కాగా స్వచ్ఛంద పదవీ విరమణ కోసం అర్హులు ముందుకు రాకపోవడంతో గత నెల నుంచి వారి వేతనాలు ఆపి వేసి స్కూల్‌కు రావొద్దని ఆదేశించారు. తాజాగా ఈవిషయమై మంత్రి ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై జిల్లా సంక్షేమాధికారిణి బ్రహ్మాజీని వివరణ కోరగా తమ రికార్డుల ప్రకారం ప్రస్తుతం జిల్లాలో 72 మంది ఆయాలు, ముగ్గురు టీచర్లు పదవీ విరమణకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లా పరిధిలో టీచర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం పదవీ విరమణ పొందుతున్న టీచర్లు, ఆయాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లా పరిధిలో ఇంకా ఎవరైనా పదవీ విరమణకు ఉన్న విషయమై పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు.

గురుకులంలో ఘర్షణ

- గాడితప్పిన క్రమశిక్షణ
- జూనియర్లపై సీనియర్ల దాడి
- అల్లాపూర్ బాలుర గురుకులంలో ఘటన



విద్యార్థుల తల్లిదండ్రులను సముదాయిస్తున్న పోలీసులు

తూప్రాన్: గురుకులంలో క్రమశిక్షణ గాడి తప్పుతోంది. పర్యవేక్షణ కొరవడి విద్యార్థులు పరస్పర దాడులకు పాల్పడుతున్నారు. ఇందుకు మండలంలోని అల్లాపూర్ బాలుర గురుకుల కళాశాల వేదికైంది. గురుకుల కళాశాలలో మంగళవారం సాయంత్రం దుస్తులు ఉతుక్కునే క్రమంలో సీనియర్లు జూనియర్ విద్యార్థులను కామెంట్ చేసినట్లు తెలుస్తోంది. రాత్రి భోజనం అనంతరం 10 గంటల ప్రాంతంలో ప్రిన్సిపాల్ మురళితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను గదుల్లోకి పంపించి వారు తమ తమ గదుల్లోకి వెళ్లారు. అయితే సీనియర్ విద్యార్థులు జూనియర్ల గదిలోకి వెళ్లి అందరిని వరుసగా నిలబెట్టి తాము చెప్పింది వినాలని, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడొద్దని హుకుం జారీ చేశారు. అంతటితో ఆగకుండా ఎదురుచెప్పిన వారిపై దాడిచేశారు. సీనియర్ల దాడుల్లో విద్యార్థులు రాకేశ్, షణ్ముఖ, అఖిల్ గాయపడ్డారు. వీరికి సంబంధించిన సామగ్రిని ధ్వంసం చేశారు. భయభ్రాంతులకు గురైన రాకేశ్ అనే విద్యార్థి కళాశాల ప్రధాన గేటు వద్దకు పరుగు తీసి ఓ ప్రయాణికుడి ఫోన్ సహాయంతో తమ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. తల్లిదండ్రులు కళాశాలకు చేరుకొని ఉపాధ్యాయులను నిలదీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు కళాశాలకు చేరుకొని గాయపడిన విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో కళాశాలకు చేరుకున్నారు. అంతకుముందే సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ శివానందం కళాశాలలో చోటు చేసుకున్న పరిస్థితులపై ఆరా తీశారు. తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో వారికి నచ్చజెప్పి పంపించి వేశారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పోలీసులతో పాటు బాలుర గురుకులాల కార్యదర్శి రమణకుమార్ తెలిపారు.

గుండె ధైర్యాన్ని కోల్పోవద్దు

- కార్యకర్తలను పువ్వుల్లో పెట్టి చూసుకుంటా
- పార్టీ మారేందుకు మహిపాల్‌రెడ్డికి మనసెలా వచ్చింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గూడెం పోయిన గుండె ధైర్యాన్ని కోల్పోవద్దన్ని తాను అండగా ఉంటానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. కార్యకర్తలకు భరోసానిచ్చారు. బుధవారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర పార్టీలో టికెట్ రాకపోతే బీఆర్ఎస్ తల్లిలా ఆదరించి మూడు సార్లు టికెట్ ఇచ్చి గెలిపిస్తే పార్టీ మారడానికి గూడెంకు మనసెలా వచ్చిందన్నారు. ఇది న్యాయమేనా? అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో కార్యకర్తలు కష్టపడితేనే మహిపాల్‌రెడ్డి గెలిచారన్నారు. పటాన్‌చెరుకు ఏం కావాలంటే అది ఇచ్చామని, నిధులను వరదలా పారించామన్నారు. ఈ ప్రాంతంలో మంచి కార్యకర్తలున్నారని తెలిపారు. పార్టీ అన్నకా కష్టాలొస్తాయని, అంతమాత్రాన కార్యకర్తలు ధైర్యాన్ని కోల్పోకూడదన్నారు. వారి బాధ్యత తనదని అందరినీ పువ్వుల్లో పెట్టి చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ఎగిరేది గూలాబీ జెండేనన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు మాజీలు కావడం తప్పదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను పోల్చుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలో ఒకటి కూడా సరిగా అమలు కాలేదన్నారు. బస్సు తప్ప అంత తూస్సేనన్నారు. అందులోనూ లొల్లేనని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులను సైతం మోసగిస్తుందన్నారు. వడ్లకు బోనస్ ఇస్తామని తరువాత సన్నాలకేనని 90 శాతం రైతులకు ఎగ్గొట్టే యత్నం జరుగుతుందని దుయ్యబట్టారు. త్వరలో నియోజకవర్గంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, శాసన మండలి మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, కార్పొరేటర్‌లు సింధు, మెట్టుకుమార్, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



దర్పం వెనుక కన్నీటి ధార

- రాజకీయాల మోజులో జీవితాలు ఆగం
- సొంత ఖర్చులతో సమావేశాలు, సభలు
- ఆస్తులు అమ్ముకొని మరీ పోరాటాలు
- నెలల తరబడి జైలు జీవితం, కేసులు, లాఠీ దెబ్బలు
- నేడు అప్పుల పాలై దయనీయ పరిస్థితి..
- చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం

తెల్లని ఖద్దరు చొక్కా.. ఖరీదైన సెల్‌ఫోన్లు.. కాళ్లకు బూట్లు.. పెద్ద పెద్ద కార్లు.. వెనుకాల నలుగురు అనుచరులు.. జేబులో రూపాయి లేకున్నా పొలిటికల్‌ లీడర్లు ఇవన్నీ చేయాల్సిందే..! దీని కోసం ఆస్తులు అమ్మి అయినా.. అప్పులు చేసి అయినా సరే దర్పం ప్రదర్శించాల్సిందే. నాడు అడ్డగోలుగా ఖర్చు చేసిన నాయకులు నేడు అప్పుల పాలయ్యారు. అప్పట్లో తాము నమ్మిన పార్టీల కోసం పునాది రాళ్లలా నిలిచారు. తమ నాయకుల గెలుపు కోసం పార్టీల జెండాలను భుజాలపై మోశారు. గెలిపించుకున్న నాయకులు గద్దెనెక్కి రాజభోగాలను అనుభవిస్తుంటే, పార్టీలకు పట్టుకొమ్మలుగా కీర్తించబడే కార్యకర్తలు మాత్రం ఏ పదవులు రాక, ఆర్థికంగా చితికిపోయి దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. నాడు జెండాలు మోసిన నాయకులే.. నేడు రోడ్డున పడ్డ పరిస్థితులపై సాక్షి ప్రత్యేక కథనం...

సాక్షి ప్రత్యేకం

ఎగిసిపడ్డ కెరటం సుభాష్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్‌): కామారం సుభాష్‌ రెడ్డి అంటేనే టీఆర్‌ఎస్‌ (నేడు బీఆర్‌ఎస్‌).. టీఆర్‌ఎస్‌ అంటేనే కామారం సుభాష్‌రెడ్డి అనేలా తెలంగాణ ఉద్యమంలో ముందునిలిచాడు. ఖద్దరు చొక్కాతో దర్పం వెలకబోస్తూ.. కారుకు మైకుతో ఎక్కడ జనం కన్పిస్తే అక్కడే తెలంగాణ ఆవశ్యకతను వివరిస్తూ గొంతు విప్పిన నాయకుడు.. అన్ని తానై చిన్నశంకరంపేట మండలంలో చక్రం తిప్పాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం సొంత డబ్బులను ఖర్చు చేసి ఎంపీపీ పీఠం కోసం కృషి చేశాడు. తొలి నుంచి పార్టీ కోసం సర్వస్వం కోల్పోయినా తెలంగాణ వచ్చిందనే తృప్తి తప్ప.. తనకేం ఒరగలేదు. ఇదే ఆవేదనతో ఈ ఐదేళ్లలో పార్టీలో గాని బయట గాని కనిపించలేదు.

చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామానికి చెందిన యువకుడు ఆర్‌.సుభాష్‌రెడ్డి రైతులు ఎదుర్కొంటున్న కరెంట్‌ కష్టాలను దగ్గరుండి చూసిన ఆయన ఉద్యమ పంథా ఎంచుకున్నాడు. అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో ఏర్పడ్డ విద్యుత్‌ కోతలకు నిరసనగా రైతులతో కలిసి రాస్తారోకోలు, సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలకు ముందుకు కదిలాడు. అదే సమయంలో టీఆర్‌ఎస్‌ ఏర్పాటుకు ముందే తెలంగాణ రైతు ఫోరం ఏర్పాటు చేసి చెరుకు రైతులకు బాసటగా ఉద్యమించాడు. మెదక్‌ నిజాం షుగర్‌ ఫ్యాక్టరీపై రైతుల తరఫున కదంతొక్కాడు.

అమరవీరుల స్తూపం ఏర్పాటులో కీలకం..

మెదక్‌ నియోజకవర్గంలో ముఖ్యనాయకుడిగా ఎదిగిన ఆయన టీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌తో కలిసి పని చేశాడు. తెలంగాణ రైతు ఫోరమ్‌ను టీఆర్‌ఎస్‌లో విలీనం చేశాడు. తెలంగాణ ఉద్యమం ఎగిసిపడుతున్న సమయంలో చిన్నశంకరంపేట మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్తూపం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ఆయన కంటే జూనియర్‌లు అనేక పదవులు పొందిన ఆయన మాత్రం ఏ పదవీ లేకుండా ఉండిపోయారు. అదే కోపంతో బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌తో ప్రజల్లోకి వచ్చినా ఫలితం దక్కలేదు. రాజకీయాలకు సైలెంట్‌ అయిపోయి వ్యాపారం చేసుకుంటున్న సమయంలో మరోసారి శాసనసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ ముఖ్యనాయకుడి పిలుపుతో రాజకీయాలకు వచ్చి ఎమ్మెల్యే గెలుపు కోసం కృషి చేశాడు. బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉన్న పదేళ్లలో ఆయన్ను పక్కనపెట్టారనే ఆవేదనతో ఈసారి జరిగిన శాసన సభ ఎన్నికల్లో కనీసం గ్రామాల్లోకి రాకుండా హైదరాబాద్‌కు పరిమితం అయ్యారు.

ఆస్తులను అమ్ముకున్నా...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం టీఆర్‌ఎస్‌తో కలిసి పని చేశా. పార్టీ కోసం సొంత ఆస్తులను అమ్ముకున్నా. పార్టీ కోసం కష్టపడ్డ, తన అనుకున్న వాళ్ల కోసం ఎన్నికల్లో ఖర్చు చేశా.. కానీ తనతో ఎదిగిన వాళ్లే తనను విస్మరించారు. తన మిత్రులు వ్యాపారాల్లో కోట్లు గడించారు. తాను మాత్రం ఉన్న ఆస్తులను అమ్ముకొని రాజకీయాలకు దూరమయ్యా. భవిష్యత్‌లో రాజకీయాలకు వస్తానా లేదా అనేది ఇప్పుడే చెప్పలేను.

– ఆర్‌.సుభాష్‌రెడ్డి, కామారం, మెదక్‌ నియోజకవర్గం


తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌ వెంట నడుస్తున్న సుభాష్‌రెడ్డి (ఫైల్‌)

నాడు మహానేతల వెంట.. నేడు పొలం బాట


ఉద్యమకాలంలో ఓ దీక్షలో ప్రసంగిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్‌)

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): 22 ఏళ్ల నుంచే రాజకీయాలపై ఆసక్తి. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర, ఎన్నో బైండోవర్‌లు, జైలు జీవితం. బీఆర్‌ఎస్‌ పార్టీ కోసం ఎనలేని కృషి, ప్రస్తుతం బీఆర్‌ఎస్‌ మహానేతలందరికీ సుపరిచితమే. పార్టీలో ఎలాంటి హోదా లేదు.. పదవీ లేదు.. అయినా నిరంతరం కష్టపడుతున్న నాయకుడే చౌటకూరి చంద్రశేఖర్‌ రెడ్డి. చిలప్‌చెడ్‌ మండలం చండూర్‌ గ్రామానికి చెందిన ఈయన తెలంగాణ ఉద్యమకాలంలో కేసీఆర్‌, హరీశ్‌రావు, కేటీఆర్‌, పద్మాదేవేందర్‌రెడ్డి, రఘునందన్‌రావు లాంటి మహా నాయకుల వెన్నంటి నడిచి, పోరాడిన వ్యక్తి. ఆయన ఘాటైన ప్రసంగాలతో ప్రజలలో నిలిచిన నాయకుడు. ఉద్యమ కాలంలో జిల్లా యువత ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆయనకు ఎలాంటి గౌరవం లేదు. కరీంనగర్‌, మెదక్‌ ఉప ఎన్నికల్లో అక్కడే రోజుల తరబడి ప్రచారంలో పాల్గొన్న వ్యక్తి. సోదరుడు చౌటకూరి గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేశాడు. పార్టీ కోసం ఎంతో కృషి చేసి, ఆర్థికంగా నష్టపోయినా ఆయన్ను మాత్రం పార్టీ పట్టించుకోలేదు. పార్టీలో ఉంటూనే, మరో వైపు తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు.

నాడు నడిపించి.. నేడు నడవలేక

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన బలిజ రమేశ్‌ తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. తెలంగాణ జేఏసీ మండల కో కన్వీనర్‌గా పని చేశాడు. టీఆర్‌ఎస్‌ (నేడు బీఆర్‌ఎస్‌) పార్టీ స్థాపించిన నాటి నుంచి విస్తృత స్థాయిలో కార్యకర్తగా, మండల అధ్యక్షుడిగా పని చేశాడు. పార్టీ నిర్వహించే సభలు, సమావేశాలకు తనకు జీవనోపాధిగా ఉన్న సుమో, క్వాలీస్‌ వాహనాల్లో సొంతంగా డీజిల్‌ పోసుకొని కార్యకర్తలను తరలించేవాడు. ఇలా పార్టీ కోసం అప్పులు చేసి కార్యక్రమాలను విజయవంతం చేసేవాడు.


పక్షవాతంతో బాధ పడుతున్న రమేశ్‌

పక్షవాతంతో మంచానికే పరిమితం

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన నాటి నుంచి పార్టీ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచినా సరైన ఆదరణ లేక చేసిన అప్పులను తీర్చలేక ఉన్న సుమో, క్వాలీస్‌ వాహనాలను అమ్ముకున్నాడు. నమ్మిన పార్టీలో గుర్తింపు లేక ఆర్థికంగా జీరోగా మిగిలిపోయాడు. కడు దుర్భరమైన జీవితాన్ని బతుకీడుస్తున్న తరుణంలో భార్య సునీత వెన్ను పూస వ్యాధికి గురైంది. సుమారు రూ.6 లక్షలు అప్పు చేసి ఆమెకు చికిత్స చేయించాడు. ఇటీవల రమేశ్‌ పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. అందినకాడికి మరో రూ.6 లక్షల వరకు అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నాడు. దీంతో తనకున్న పదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు సాయి వర్షిత్‌, లక్ష్మి తేజల చదువులు అగమ్యగోచరంగా మారాయి. భార్య సునీత బయట పనులు చేయక, తాను ఇంటి పట్టునే ఉండటంతో పోషణ కష్టతరంగా మారుతోంది. పోషణ కోసం ఉన్న బంగారాన్ని అమ్ముకున్నానని, దిన దినగండంగా బతుకీడుస్తున్నామని, పార్టీ పెద్దలు దయ చూపి ఆర్థికంగా ఆదుకోవాలని 'సాక్షి' ద్వారా వేడుకుంటున్నాడు.

కూరగాయలు అమ్ముతున్న మాజీ కో ఆప్షన్‌ మెంబర్‌

మండల కేంద్రమైన మిరుదొడ్డికి చెందిన ఎండీ.హస్సేన్‌ టీఆర్‌ఎస్‌ పార్టీ ఏర్పడినప్పటి నుంచి కార్యకర్తగా పని చేస్తూనే తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమించాడు. రాష్ట్రం కోసం చేసిన ఉద్యమంలో తనపై సుమారు 7 కేసులు నమోదు కావడమే కాకుండా జైలుకు వెళ్లాడు. 2014లో పార్టీ తరఫున మండల కో ఆప్షన్‌ మెంబర్‌గా ఎన్నికయ్యాడు. తాను నమ్మిన పార్టీ కోసమే కాకుండా ఒక నాయకుడిగా గుర్తింపు తెచ్చుకోవడానికి అందినకాడికి అప్పులు చేసి పార్టీ నాయకుల గెలుపు కోసం కృషి చేశాడు. టీఆర్‌ఎస్‌ కాస్త బీఆర్‌ఎస్‌ పార్టీగా ఆవిర్భవించిన నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలకు, సభలు సమావేశాలకు సమాచారం ఇవ్వకపోవడంతో హస్సేన్‌ పార్టీలో ఒంటరిగా మిగిలిపోయాడు. గతంలో పార్టీ కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురయ్యాడు. ప్రస్తుతం దూరంగా ఉంటూ అంగట్లో కూరగాయలు అమ్ముకుంటూ భార్యా పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు.


అంగట్లో కూరగాయలు అమ్ముకుంటున్న మాజీ మండల కో ఆప్షన్‌ మెంబర్‌ హస్సేన్‌

క్లుప్తంగా

టాస్కులు, కమీషన్‌ పేరుతో సైబర్‌ మోసం

రూ.1.69 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్‌: టాస్కులు, కమీషన్‌ పేరుతో జరిగిన సైబర్‌ మోసంలో ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని సాయిరాం కాలనీకి చెందిన ప్రైవేట్‌ ఉద్యోగికి జనవరి 2వ తేదీన టాస్కులు పూర్తి చేస్తే కమీషన్‌ ఇస్తామంటూ మెసేజ్‌ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేసి, నగదు ఇన్వెస్ట్‌ చేస్తూ పలు దఫాలుగా రూ.1.69 లక్షలు పెట్టుబడి పెట్టాడు. అనంతరం బాధితుడు తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్‌ ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీసీఎం వాహనం బోల్తా


రోడ్డుకు అడ్డంగా డీసీఎం

కొండపాక(గజ్వేల్‌): డీసీఎం వాహనం బోల్తా పడిన ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల జిల్లాలోని జిల్లెల్ల గ్రామం నుంచి వికారాబాద్‌ జిల్లా తాండూర్‌కు డీసీఎం వాహనంలో రేషన్‌ బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. దుద్దెడ గ్రామంలోని ఓ మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో బియ్యం బస్తాలు దారికి అడ్డంగా పడిపోయాయి. డ్రైవర్‌, క్లీనర్‌కు గాయాలవ్వగా సిద్దిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై పడిన బస్తాలను పోలీసులు దగ్గరుండి మరో వాహనంలోకి మార్పిడి చేయించి ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు. ఈ విషయమై త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌ దృష్టికి తీసుకెళ్లగా డీసీఎం బోల్తా పడిన విషయం వాస్తవమేనని, ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

వలస కూలీ ఆత్మహత్య

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): పొరుగు రాష్ట్రం నుంచి పని కోసం వలసొచ్చిన ఓ యువ కూలీ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చిలప్‌చెడ్‌ మండలం గన్యతండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్‌ మహబూబ్‌ కథనం మేరకు.. ఒరిస్సా రాష్ట్రం నబ్రంగాపూర్‌ జిల్లా డొంగిరిగూడ గ్రామం హోలదిగూడ నివాసి జగన్నాథ్‌బాత్ర (20) ఇంటి వద్ద పనులు చేయకుండా ఖాళీగా ఉండేవాడు. ఇతడి పెద్దనాన్న భోజనాథ్‌బాత్ర చిలప్‌చెడ్‌ గన్యతండాలో అటవీ ప్రాంతంలో మొక్కలు నాటే పనులు చేస్తుండేవాడు. ఈ నెల 9న జగన్నాథ్‌బాత్రను, మరికొంత మంది కూలీలను భోజనాథ్‌ బాత్ర మొక్కలు నాటే పని కోసం చిలప్‌చెడ్‌కు తీసుకొచ్చాడు. బుధవారం ఉదయం అందరూ అడవిలో మొక్కలు నాటేందుకు వెళ్లగా జగన్నాథ్‌బాత్ర వెళ్లలేదు. సాయంత్రం అందరూ పని నుంచి వచ్చేసరికి జగన్నాథ్‌ ఇంట్లో లేడు. చుట్టుపక్కల అడవిలో వెతకగా చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. ఈఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని రేబర్తి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో పెద్దమ్మ విగ్రహానికి ఉన్న మూడు గ్రాముల బంగారు పుస్తె, ముక్కు పుడుక, తులం వెండి మెట్టెలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ముదిరాజ్‌ సంఘం పెద్దలు తెలిపారు. బుధవారం ఘటనా స్థలాన్ని చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు సందర్శించి, చోరీకి సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆలయాల వద్ద తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగలను త్వర్లోనే పట్టుకుంటామని వివరించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ జిల్లా జగదీశ్వర్‌ ఉన్నారు.

పంచాక్షరీ మంత్రం సర్వ శ్రేయస్కరం

పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు

సదాశివపేట(సంగారెడ్డి): ఓం నమ శివాయ అనే పంచాక్షరీ మంత్రం సర్వ శ్రేయస్కరమని మహా సహస్ర అవధాని పద్మశ్రీ గరికపాటి నర్సింహా రావు సూచించారు. పట్టణంలోని బసవ సేవాసదన్‌లో వీరశైవ చౌకిమఠం సమాజం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శివ పంచాక్షరీ కోటి జప యజ్ఞ సామూహిక ఇష్ట లింగార్చన కార్యక్రమం బుధవారంతో ఐదవ రోజుకు చేరుకుంది. కార్యక్రమానికి హాజరైన గరికపాటి మాట్లాడుతూ.. మహాత్మ బసవేశ్వరుడు మానవతవాది అని, అందరినీ భక్తిమార్గంలో నడిపిన మహనీయుడని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో వీరశైవ సమాజం చౌకిమఠం సమాజం ఆధ్వర్యంలో ఇలాంటి ఆధ్యాత్మికమైన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా గరికపాటికి కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్య మహాస్వామి బసవేశ్వరుడి జ్ఞాపికను అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో మహత్‌ సిద్దేశ్వర నందగిరి మహారాజ్‌ బర్దిపూర్‌, ప్రొఫెసర్‌ కసిరెడ్డి వెంకట్‌ రెడ్డి, వీరశైవ సమాజం చౌకిమఠం అధ్యక్షుడు చీల మల్లన్న, ఉపాధ్యక్షుడు బస్వరాజ్‌, ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం, గౌరవ సభ్యుడు బోడగామ శ్రీశైలం, పులుమామిడి వీరేశం, బస్వరాజ్‌, అర్చన పురోహితులు పాల్గొన్నారు.


గరికపాటికి జ్ఞాపిక అందజేత


ప్రవచన కార్యక్రమానికి హాజరైన భక్తులు

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

మల్లన్న ఆలయంలో పని చేయని సీసీ కెమెరాలు

కొమురవెల్లి(సిద్దిపేట): నిత్యం వేలాది మంది భక్తులతో కిటకిటలాడే మల్లన్న క్షేత్రంలో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. ఆలయంలో ముఖ్యమైన ప్రదేశాల్లో ఉన్న చాలా సీసీ కెమెరాలు సంవత్సర కాలంగా పని చేయకపోవడంతో అధికారులపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం హుండీ లెక్కింపులో బంగారు గొలుసు, ఉంగరం మాయమై గొలుసు చెత్త కుప్పలో ప్రత్యక్షమైన విషయం పాఠకులకు విదితమే. దొంగతనానికి యత్నించిన వ్యక్తులను గుర్తించేందుకు ఆలయ ఈవో బుధవారం పోలీసులతో కలిసి సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. కానీ హుండీ లెక్కింపు జరుగుతున్న ముఖ మండపంలో 4 సీసీ కెమెరాలు ఉంటే 2 మాత్రమే పని చేస్తున్నాయి. దొంగతనం జరిగిన ప్రదేశంలోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని ఆలయంలోని కొంత మంది అధికారులు సిబ్బంది గుట్టు చప్పుడు కాకుండా హుండీ లెక్కించిన ప్రతీసారి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆలయ ఈవో బాలాజీని వివరణ కోరగా లోతైన విచారణ చేపట్టి దొంగ తననానికి యత్నించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.


ముఖమండపంలో పని చేయని సీసీ కెమెరా

ముమ్మరంగా జాతీయ రహదారి నిర్మాణం

- కొండను తవ్వి 40 అడుగుల లోతు నుంచి పనులు
- అక్కన్నపేట రైల్వే లైను కింది భాగం నుంచి రోడ్డు, బ్రిడ్జి

రామాయంపేట(మెదక్‌): మెదక్‌– ఎల్కతుర్తి మధ్య జాతీయ రహదారి 165 డీజీ నిర్మాణంలో భాగంగా రామాయంపేట మండలం అక్కన్నపేట వద్ద రైల్వే లైను కింది భాగం నుంచి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి ఆ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని అక్కన్నపేట వద్ద చెరువు కట్టను ఆనుకొని ఉన్న పెద్ద కొండను తవ్వి లెవల్‌ చేస్తున్నారు. సుమారు వంద అడుగుల భారీ స్థాయిలో ఉన్న కొండను మిషన్ల ద్వారా తవ్వుతూ భూమి లెవల్‌ చేస్తున్నారు. రోడ్డు లెవల్‌ కలువడానికి అక్కన్నపేట– మెదక్‌ రైల్వేలైను వద్ద నుంచి గ్రామ శివారులోని పెట్రోల్‌ పంపు వరకు సుమారుగా కిలో మీటర్‌ మేర 40 అడుగుల లోతు నుంచి గేటు వరకు రహదారి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మించే ప్రాంతంలో రెండు వైపులా భారీ స్థాయిలో గోడ నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో అక్కన్నపేట వద్ద జరిగే పనులు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.


కొండను భూమి లెవల్‌ చేస్తున్న దృశ్యం

హైమద్‌ ఆదర్శనీయం..

- తప్పిపోయిన ఉత్తరప్రదేశ్‌ వాసిని కుటుంబీకులకు అప్పగింత


గుల్షన్‌ను అన్నకు అప్పగిస్తున్న హైమద్‌

పాపన్నపేట(మెదక్‌): మానసికస్థితి సరిగా లేని ఓ యువకుడిని చేరదీసి, అతడి కుటుంబీకులకు అప్పగించి పరమత సహనం చాటుకున్నాడు పాపన్నపేటకు చెందిన హైమద్‌. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్రం, ముజఫర్‌ నగర్‌ జిల్లా, సోంజని గ్రామానికి చెందిన గుల్షన్‌(20) 18 రోజుల కిందట తప్పిపోయి రైలు ఎక్కి హైదరాబాద్‌ వచ్చాడు. మానసిక పరిస్థితి సరిగా లేని అతడు 4 రోజుల కిందట కాలినడకన పాపన్నపేట మండలం కుర్తివాడ గేట్‌ వద్దకు వచ్చాడు. అక్కడి స్థానికులు గుల్షన్‌ను దొంగగా అనుమానించి దాడి చేసి వెళ్లగొట్టడంతో పాపన్నపేటలోని హైమద్‌ హోటల్‌ ఎదుట సొమ్మసిల్లాడు. ఇది గమనించిన హైమద్‌ అతడికి చేరదీసి మూడు రోజులు భోజనం పెట్టాడు. మధ్యలో ఒకసారి తనది యూపీ సోంజని గ్రామంగా పేర్కొన్నాడు. వెంటనే హైమద్‌ గూగుల్‌ మ్యాప్‌ ఆధారంగా కొంతమంది దుకాణదారుల పేర్లు తెలుసుకొని గుల్షన్‌ ఫొటో పంపాడు. అతడిని గుర్తించిన దుకాణదారులు, తమ గ్రామమేనని, లీలాదేవి, రాజ్‌బుల్‌ దంపతుల కొడుకు అని చెప్పారు. వెంటనే వారికి ఫోన్‌ చేసిన హైమద్‌ వివరాలు తెలుపగా అతడి అన్న అమ్రిస్‌ పాపన్నపేటకు వచ్చి హైమద్‌కు కృతజ్ఞతలు చెప్పి గుల్షన్‌ను తీళ్లాడు.

గంజాయి విక్రేతల అరెస్ట్‌


వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

- పోలీసుల అదుపులో తొమ్మిది మంది
- రూ.లక్ష విలువైన సామగ్రి, రూ.23 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్‌: గంజాయి అమ్ముతున్న వ్యక్తితో పాటు అతడి నుంచి కొనుగోలు చేస్తున్న యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. కేసు వివరాలను సిద్దిపేట టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఉపేందర్‌తో కలిసి ఏసీపీ మధు వెల్లడించారు. కోహెడ మండలం బస్వాపూర్‌ గ్రామానికి చెందిన బానోతు గణేశ్‌ (21) తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ దగ్గర పెరిగాడు. దీంతో చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. కరీంనగర్‌లో ఓ డెకరేషన్‌ నిర్వాహకుడి వద్ద పనిచేస్తూ గంజాయికి అలవాటు పడ్డాడు. ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తుండేవాడు. ఈ ఏడాది జనవరిలో జైలుకు వెళ్లగా అక్కడ పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడురు గ్రామానికి చెందిన నలిమెల వినోద్‌ పరిచయమయ్యాడు. జైలు నుంచి విడుదల అయ్యాక గణేశ్‌ వినోద్‌ నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో అమ్ముతున్నాడు. ఈ క్రమంలోనే గణేశ్‌ మంగళవారం సిద్దిపేట పట్టణంలోని డబుల్‌ బెడ్రూం ఇళ్లలో కొంత మంది యువకులకు గంజాయి విక్రయిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు, సిద్దిపేట టూటౌన్‌ పోలీసులు వెళ్లి దాడులు చేశారు. గణేశ్‌తోపాటు గంజాయి కొన్న మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో సిద్దిపేట పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన అంతగిరి అరుణ్‌, పొన్నాల కుమార్‌, బాదరబోయిన కరుణాకర్‌, సిద్దరబోయిన అఖిల్‌, నారాయణరావుపేట చందు, కానుగంటి గణేశ్‌, అంబటి లక్ష్మీనర్సింహ్మా, తాటికొండ శ్రీమాన్‌ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.లక్ష విలువైన ఎండు గంజాయి, కారు, 9 సెల్‌ఫోన్‌లు, రూ.23వేల నగదు స్వాధీనం చేసుకొని తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మధు తెలిపారు. సమావేశంలో టూటౌన్‌ సీఐ ఉపేందర్‌, టాస్క్‌ఫోర్స్‌ సీఐలు రమేశ్‌, జానకీరామ్‌ రెడ్డి, ఎస్‌ఐలు సాయిప్రసాద్‌, రాజేశం, సాయిచరణ్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ప్రొఫెసర్‌ కన్నుమూత

నివాళులర్పించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


సుభాష్‌ (ఫైల్‌)

దుబ్బాక : దుబ్బాక పట్టణంలోని పేద చేనేత కార్మిక కుటుంబంలో పుట్టి.. ఎన్నో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరుకున్న మేధావి, కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్‌ కారంపురి సుభాష్‌ గుండెపోటుతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఈయన మృతితో దుబ్బాకలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు దుబ్బాకలోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రభాకర్‌ రెడ్డి నివాళులు

సుభాష్‌ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, చేనేత సంఘం మాజీ చైర్మన్‌ బోడ శ్రీనివాస్‌, పద్మశాలీ సమాజం అధ్యక్షుడు తిరుపతి, బీఆర్‌ఎస్‌ నాయకులు ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, ఆస యాదగిరి తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి